క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి : డీఎస్పీ

పాలకొండ: ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని డీఎస్పీ కృష్ణారావు సూచించారు. పాలకొండ-శ్రీకాకుళం రహదారిలోని చెక్‌పోస్టును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలకు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనల మేరకు నగదు తరలింపులు ఉండాలని, అంతకు మించి తరలిస్తే అనుమతులు తీసుకోవాలని తెలిపారు. వివాదస్పదంగా ఎవరు వాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

సీతంపేటలో పోలీసుల కవాతు



సీతంపేటలో కవాతు చేస్తున్న పోలీసులు

సీతంపేట: సీతంపేట గ్రామంలో ఎస్‌ఐ ఎం.జగదీష్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పీఎంఆర్‌సీ నుంచి ఐటీడీఏ వరకు కవాతు నిర్వహించారు. ఓటు వినియోగంపై ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నారు.

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

సీతంపేట: మండలంలోని పెద్దపొల్ల, దుగ్గి, నాయకమ్మగూడ, మానాపురం, టిటుకుపాయి గ్రామ పంచాయతీల పరిధిలో పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు సర్వసభ్య సమావేశం చక్కని వేదిక అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమస్యల పరిష్కారం ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాలలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ తదితర సమస్యలపై దృష్టి సారించామన్నారు. సమావేశంలో మండల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు ఒంటిపూట



గరుగుబిల్లిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

గరుగుబిల్లి: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం నుంచి ఒక్క పూట నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కేంద్రాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐరన్ మాత్రలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కేంద్రాలలో సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ఇదిలావుండగా ఎండల తీవ్రత దృష్ట్యా మే 1 నుంచి మే 15 వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు, మే 16 నుంచి మే 30వరకు అంగన్‌వాడీ సహాయకులకు సెలవులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

కురుపాం: స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రతీ ఎన్నికల్లో అల్లువాడ నుంచి ప్రచారం ప్రారంభించటం శత్రుచర్ల కుటుంబానికి మొదటి నుంచి ఆనవాయితీ. గురువారం ఉదయం 9 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణితో పాటు ఐదు మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనున్నారు. అలాగే ఈ నెల 24న పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేయనున్నారు.

ఇప్పపువ్వు సీజన్ ఆరంభం

- మూడు నెలల పాటు ఉపాధి
- ఇప్ప పువ్వుల్లో ఎన్నో పోషకాలు



కొత్తగూడలో ఇప్పపువ్వును ఆరుబయట ఎండబెట్టిన గిరిజనులు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో ఈ వేసవిలో ఇప్ప పువ్వు సీజన్ ఆరంభమైంది. గిరిజనులు అటవీ ఉత్పత్తులు సేకరించి వాటిని విక్రయిస్తూ ఉపాధి పొందుతుంటారు. కొందరు అడవిలో ఉండే వెదురుతో వివిధ రకాల వస్తువులు తయారు చేస్తుంటారు. కాలానికి అనుగుణంగా ఉపాధిని ఇచ్చే వృక్షాల్లో ఇప్పచెట్లు ప్రధానమైనవి. వేసవిలో వీటి ద్వారా గిరిజనులు ఉపాధి పొందడానికి అనేక అవసరాలు ఉన్నాయి. ఇప్ప పువ్వును గిరిజనులు తెల్లవారు జామునే అడవిలోకి వెళ్లి సేకరిస్తారు. చెట్లపై నుంచి కిందపడిన ఇప్పపువ్వును మధ్యాహ్ననికి సేకరించి ఇంటికి తెచ్చి ఎండబెడతారు. మన్యం ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ఇప్పచెట్ల ద్వారా మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. ఖరీఫ్, రబీ పనులు ముగిసే సమయానికి ఇప్పచెట్లు విరగపూస్తాయి. ఈ పువ్వులను గిరిజనులు సేకరిస్తారు. వీటిని కిలో రూ.100 నుంచి 150 వరకు విక్రయిస్తారు.

ఇప్ప పువ్వు తైలంతో వ్యాధులు నయం...

ఇప్ప పువ్వు నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం వంటి వ్యాధులకు ఉపయోగిస్తారు. ఇప్ప పువ్వుతో దంతాలను శుభ్రం చేసుకోవడంతో దగ్గుకు, దంతాలకు సంబంధించిన వ్యాధులకు ఔషధంగా పని చేస్తుంది. వైద్య శాస్త్రంలోనూ ఇప్ప పువ్వు ప్రాధాన్యతను సంపాదించుకుంది. అడవిలో లభించే ఇప్ప పువ్వుల గింజల నుంచి తీసిన నూనెలో ఎన్నో పోషక విలువలున్నట్లు శాస్త్రీయంగా నిరూపించారు. బారత శాస్త్రీయ సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయంతో 1999లో నిర్వహించిన పరిశోధనలో ఎండిన ఇప్ప పువ్వుల నుంచి పంచదారను తయారు చేసి జాబహ, కేక్‌లు, చాక్లెట్‌లు తయారు చేసే విధానాన్ని కనిపెట్టారు. ఇప్పపువ్వు నిల్వకు మధ్యలో ఎండిన వేప ఆకును వేస్తే నిల్వ ఉంటుందని గిరిజనులు చెబుతున్నారు.

అడుగడుగునా ఎమ్మెల్యే కళావతికి ఆదరణ

- బత్తిలిలో ఘన స్వాగతం పలికిన కార్యకర్తల
- అండగా ఉంటామంటూ ఆదివాసీల భరోసా



బత్తిలిలో భారీ ఊరేగింపు నడుమ ఎమ్మెల్యే కళావతి ప్రచారం

భామిని: సంక్షేమ సారథి జగనన్నకు అండగా ఉంటూ మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామంటూ ప్రజలు భరోసా ఇచ్చారు. మండలంలోని బత్తిలి, పాలవలస, బిచ్చుమానుగూడ, ఎరకరాయిగూడ, మనుమకొండ, కాట్రగడ బీ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. రానున్న ఎన్నికల్లో అండగా ఉంటూ మిమ్మల్ని గెలిపిస్తామని భరోసా ఇచ్చారు. ముందుగా బత్తిలి సంతోషిమాత ఆలయంలో ఎమ్మెల్యే కళావతి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. బత్తిలి సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కో-ఆప్షన్ సభ్యులు విశ్వనాథ పట్నాయిక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వందలాది మంది కార్యకర్తలు నృత్యాలు చేస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పార్టీ నాయకులు జగనన్న పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ ప్రచారం గావించారు. పాలవలస, బిచ్చుమానుగూడ, మనుమకొండ, ఎరకరాయిగూడలలో సర్పంచ్‌లు కొండగొర్రి సబితా, నిమ్మల కేశవ, ఎంపీటీసీ పత్తిక మురళి సమక్షంలో ఆదివాసీ మహిళలు సాంప్రదాయ బద్దంగా పసుపు కుంకుమ రాసి, కాళ్లు కడిగి పూలమాలలు వేసి స్వాగతం పలికారు.

జెడ్పీటీసీ బి.చిన్నమ్మి, పార్టీ నాయకులు తోట సింహాచలం, కొవ్వాడ చిరంజీవులు, మజ్జి మోహన బాబు, అగతముడి రఘు, కొత్తకోట చంద్రశేఖర్, గెల్లంకి రమేష్, నిమ్మల దాస్, రాగోలు రాధాకృష్ణ, వమ్మరవిల్లి రమేష్, నిమ్మల అన్నయ్య, కె.తమ్మారావు, మడపాన కేశవ, భార్గవనాయుడు, శివ్వాల తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన పింఛన్ కష్టాలు

- టీడీపీ వికృత చేష్టలతో వృద్ధుల పాట్లు
- పింఛన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు



పింఛన్‌ల కోసం వీరఘట్టం సచివాలయం వద్ద ఎదురు చూస్తున్న వృద్ధులు

వీరఘట్టం: రాష్ట్రంలో చంద్రబాబు కుట్రతో వలంటీర్లతో చేపట్టే పింఛన్ల పంపిణీకి బ్రేక్ పడింది. దీంతో గత టీడీపీ ప్రభుత్వంలో వలె పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పడిగాపులు పడాల్సి వస్తుంది. బుధవారం నుండి సచివాలయాల వద్ద పింఛన్లు ఇస్తారని తెలియడంతో తెల్లవారే సరికి వీరఘట్టం సచివాలయానికి వృద్ధులు చేరుకుని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధుల ఇబ్బందులు చూసిన సచివాలయ సిబ్బంది వారికి ఇంటికి పంపించేశారు. వీరఘట్టంలో పలు ప్రభుత్వ పాఠశాలల వద్ద సామాజిక భవనాల వద్ద పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు చేసారు. దూరప్రాంతాల నుండి పింఛన్లు కోసం వచ్చిన వృద్ధులు చాలా ఇబ్బందులు పడ్డారు.

ముసలివాళ్లపైనా మీ ప్రతాపం



ప్రతీ నెలా 1వ తేదీన వలంటీరు వచ్చి పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు సచివాలయంకు వెళ్లి పింఛన్ తీసుకోమంటున్నారు. మా లాంటి వృద్ధులం దూరంగా ఉన్న సచివాలయానికి ఈ మండుటెండలో ఎలా వెళ్లగలం. ముసలి వాళ్లపైనా మీ ప్రతాపం. ఇటువంటి చర్యలు మానుకోండి.

– సర్వాజ్యోష్యుల లక్ష్మీ అన్నపూర్ణ, అగ్రహారం వీధి, వీరఘట్టం

ఉన్నచోట నుండి లేవలేను



అప్పుడేమో టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి ఎండలో ఉంటే వచ్చేది. ముఖ్యమంత్రి జగన్ దయవల్ల వలంటీర్లు ద్వారా మా ఇంటికే పింఛన్ ఇవ్వడంతో ఈ ఐదు సంవత్సరాలు హాయిగా ప్రతీ నెలా పింఛన్ ఇంటి వద్దే తీసుకుంటున్నాం. మళ్లీ ఇప్పుడు పంచాయతీ ఆఫీసుకు పింఛన్ కోసం వెళ్లాలని చెబుతున్నారు. ఉన్నచోట నుండి లేవలేని పరిస్థితి నాది. పింఛన్ తీసుకోవడానికి ఎలా వెళ్లగలను. మాకు ఇబ్బందులు పెట్టడం పద్ధతి కాదు. – పొందూరు నారాయణమ్మ, వీరఘట్టం

పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గరుగుబిల్లి, గొట్టివలస, పెద్దూరు, రావివలస తదితర గ్రామాలలో సామాజిక పింఛన్లు పంపిణీ బుధవారం చేపట్టారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున గ్రామ వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో బ్యాంకు సెలవుల కారణంగా ఈ నెల పింఛన్ల పంపిణీ కాస్త ఆలస్యమైంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం నుంచి సచివాలయాల్లో సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, వితంతువులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు పర్యవేక్షించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్లు అందించాలని సిబ్బందికి సూచించారు.

ఆశ్రమం నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి పంచాయతీ గుణద గ్రామంలో లలితా విద్యా గణేష్ పీఠం ఆశ్రమం నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. హైదరాబాద్‌కు చెందిన బ్రహ్మశ్రీ రవికోటి శ్రీనివాసరావు, బ్రహ్మశ్రీ నాగారం మనోహర శర్మ, మంత్రి ప్రగడ ఫణికుమార్ శర్మ, కొల్లూరు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు, వైశ్య సంఘం అధ్యక్షుడు జి.హరిప్రసాద్ మాట్లాడుతూ.. గుణద గ్రామంలో నిర్మించే ఆశ్రమం ద్వారా గిరిజన ప్రాంతంలో ఆధ్యాత్మికత నెలకొంటుందన్నారు.

ముగిసిన శివాలయ ప్రతిష్ట



పూజలను నిర్వహిస్తున్న రుత్వికులు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ పునరావాస గ్రామంలో కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా మండపారాధన, హోమాలు, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను రుత్వికులు దుర్గాప్రసాద్ శర్మ, మణికంఠ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి శాంతి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమంను నిర్వహించారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

కొమరాడ మండలం కెమిశీల గ్రామానికి వెళ్లే రహదారి గతంలో గోతులతో నిండి అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి నిర్మాణానికి రూ.3.74 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో జియ్యమ్మవలస మండలం సీమనాయుడు వలస నుంచి కొమరాడ మండలం కెమిశీల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. నాడు అధ్వానంగా ఉన్న రోడ్డు నేడు అద్భుతంగా మారిందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కురుపాం:



అధ్వానంగా ఉన్న సీమనాయుడు వలస- కెమిశీల రహదారి



రూ.3.74 కోట్లతో నిర్మించిన కెమిశీల రహదారి (నేడు)

నేటి నుంచి కైలాసనాథ జాతర మహోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో కైలాసనాథ ఆలయం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమా కైలాస నాథ స్వామి ఆలయం 41వ వార్షికోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. జాతరలో జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, బ్రేక్ డాన్స్, తదితర వినోద పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ



సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీపై సూచనలు చేస్తున్న ఎంపీడీవో

పాలకొండ రూరల్: నగదు విత్‌డ్రా చేసుకున్న సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛను మొత్తాలను అందించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఈ ప్రక్రియ కచ్చితంగా చేపట్టాలన్నారు. మండలంలోని అంపిలి సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ ముఖ్యంగా డయాలసిస్, సికిల్‌సెల్ ఎనీమియాతో పాటు దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న, మంచానికి పరిమితమైన వారిని గుర్తించి తొలి దశలో వారికి చెల్లింపులు చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన, పనులపై బయటకు వెళ్లి పింఛను అందించే సమయానికి లేకున్నా వారికి అంగన్‌వాడీ, పాఠశాల, రచ్చబండ వద్ద ఏక కాలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బట్వాడా చేపట్టాలన్నారు. 4, 5 తేదీల్లో ఈ ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శివదీక్షా ఉపనయనములు



ఉపనయన దీక్షలు చేపట్టిన కళింగ వైశ్య యువత

వీరఘట్టం: స్థానిక రమా సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన యువత శివదీక్షా ఉపనయనములు చేపట్టారు. పార్వతీపురానికి చెందిన వేదపండితులు రమణమూర్తి, రామకృష్ణశర్మ వీరికి దీక్షా కంకణాలు కట్టారు. దీక్షలు చేపట్టిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. స్థానిక కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన వూణ్న నగేష్, గ్యాస్ సురేష్, వూణ్న జనార్ధన శ్రీనివాస్, స్వరూప్, శ్రీనుబాబు తదితరుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉపనయనముల దీక్షలు చేపట్టేందుకు వీరఘట్టం, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి, వంగర, పాలకొండ తదితర మండలాల్లోని కళింగ వైశ్య యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం కావాలి



అన్నవరం ప్రాథమిక వైద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవి సీజన్‌లో గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా సేవలు మరింత విస్తృతం చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీని ఆయన బుధవారం సందర్శించారు. అక్కడ వైద్యాధికారి వి.కమల్‌నాథ్‌తో మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రజల్లో ఆరోగ్య భద్రత అవశ్యకతపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీలో 24 గంటల సేవలు కచ్చితంగా అమలయ్యేలా చొరవ చూపాలన్నారు. అనంతరం ఉపాధి సాంకేతిక సహాయకులతో తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ నెలలో చేపట్టనున్న పనుల వివరాలు, వేతనదారులకు వంద రోజులు పనులు కల్పించేందుకు తీసుకున్న చర్యలపై పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ ఉన్నారు.

30 మంది వలంటీర్ల రాజీనామా



ఎమ్మెల్యే కళావతికి రాజీనామా పత్రాలు అందిస్తున్న బత్తిలి వలంటీర్లు

భామిని: మండలంలోని బత్తిలి-1, బత్తిలి-2 సచివాలయాల పరిధిలోని 30 మంది గ్రామ వలంటీర్లు బుధవారం సామూహిక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సమక్షంలో రాజీనామా చేశారు. ప్రతిపక్షాల విమర్శలు, పింఛన్ల అందివ్వకుండా అడ్డుకోవడాన్ని సహించలేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారి పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఓటు హక్కుపై చైతన్యం



ఓటుహక్కుపై ర్యాలీ చేస్తున్న ట్రైబుల్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది

సీతంపేట: గిరిజన గ్రామాల్లో ఓటు హక్కుపై ట్రైబుల్ వెల్ఫేర్ అధికారులు బుధవారం చైతన్యం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆధ్వర్యంలో హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు హడ్డుబంగి, ఈతమానుగూడ, జామితోట గ్రామాల్లో ర్యాలీ చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం మానవహారం చేశారు. కార్యక్రమంలో ఏటీడబ్ల్యావో మంగవేణి, ఏఎంవో కోటిబాబు, ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

తీరిన రహదారి కష్టాలు

పాలకొండ - రాజాం రహదారి పేరు చెబితే గతంలో ప్రయాణికులు హడలిపోయేవారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ రహదారి బాగు కోసం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. దీంతో ఏళ్ల తరబడి రహదారి కష్టాలు ప్రయాణికులను వెంటాడాయి. రహదారి పూర్తిగా దెబ్బతిని పెద్ద గుంతలతో ప్రయాణికులు నరకయాతన అనుభవించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి కోసం రూ.3.75 కోట్లు మంజూరు చేయడంతో అత్యంత సుందరంగా రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం ప్రయాణికులు ఈ రహదారిలో హాయిగా జర్నీ చేస్తున్నారు. – పాలకొండ



పూర్తిగా దెబ్బతిన్న రహదారి



సుందరంగా మారిన రహదారి